పురిటి నొప్పుల్లోనే...!

పుట్టపర్తిలో కానరాని జిల్లా కార్యాలయాలు

● మూడేళ్లు గడిచినా పూర్తిగా తరలిరాని ఆఫీసులు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



హిందూపురంలోని పాస్‌పోర్టు కార్యాలయం

పుట్టపర్తి రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంగా ఏర్పడి మూడేళ్లు గడిచినా పుట్టపర్తిని సమస్యలు వీడటం లేదు. జిల్లా విభజన జరిగినప్పటికీ కొన్ని శాఖలు ఇక్కడి తరలిరాలేదు. వచ్చిన శాఖలు సిబ్బంది, వసతుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రధానంగా ఇక్కడ పాస్‌పోర్టు కార్యాలయం లేకపోవడంతో విదేశాలకు వెళ్లాలనుకునేవారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. పుట్టపర్తి చుట్టుపక్కల మండలాల ప్రజలు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే అనంతపురం, లేదా హిందూపురం వెళ్లాల్సి వస్తోంది. ఎటువైపు వెళ్లాలన్నా దాదాపు 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. పుట్టపర్తితోపాటు జిల్లాలోని ప్రజలు ప్రతినెలా వందల సంఖ్యలో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుంటుంటారు. ఏదైనా చిన్న పొరపాటు జరిగినా అనంతపురం లేదా హిందూపురం నాలుగైదుసార్లు వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంటోందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోనే పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వాహనదారుల్లో అయోమయం

జిల్లా కేంద్రంలో ఆర్టీఓ కార్యాలయం లేకపోవడంతో వాహన రిజిస్ట్రేషన్లకు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని పుట్టపర్తి ప్రజలు వాపోతున్నారు. వివిధ వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కావాలంటే ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి హిందూపురం వెళితే అనంతపురం వెళ్లమంటారు. అనంతపురం వెళితే ఇక్కడ మీకు అవకాశం లేదంటూ అక్కడి అధికారులు చెబుతుండటంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇవేకాక జిల్లాకోర్టు, వక్ఫ్‌బోర్డు, మైనారిటీ శాఖలు, మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయాలు, జిల్లా గ్రంథాలయం, ఎంప్లాయిమెంటు కార్యాలయం నేటికీ ఏర్పాటు కాలేదు. ఎప్పటి ఏర్పాటు చేస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏఆర్ కాపీ సౌకర్యం కల్పించాలి



ఏదైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆసుపత్రుల్లో చికిత్స పొందడానికి ఏఆర్ కాపీ అవసరమవుతుంది. దీనికోసం అనంతపురం వెళ్లాల్సి వస్తోంది. అసలే ప్రమాదాల్లో గాయపడి బాధపడుతున్న సమయంలో యాక్సిడెంటల్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాల కోసం అనంతపురం వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లాకేంద్రంలోనే ఆఫీసు ఉంటే ఇబ్బందులు తప్పుతాయి.

-దాసరి శంకర్, పుట్టపర్తి

పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయాలి



జిల్లాకేంద్రంలో పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం పాస్‌పోర్టు ఇంటర్వ్యూకు వెళ్లాలంటే హిందూపురం, అనంతపురం లేదా తిరుపతి వెళ్లాల్సి వస్తోంది. ఇది సమయాభావం, ఆర్థిక సమస్యలతో కూడుకున్నది. ఈ సమస్య తొలగించడానికి పుట్టపర్తిలోనే కార్యాలయం ఏర్పాటు చేయాలి. -అమ్మినేని కిష్టప్ప, న్యాయవాది, పుట్టపర్తి

నేటి నుంచి పది పరీక్షలు



గుడిబండ ఉన్నత పాఠశాలలో రోల్ నంబర్లు వేస్తున్న దృశ్యం

కొత్తచెరువు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఓపెన్ పాఠశాలలకు చెందిన 28,730 మంది సోమవారం పదో తరగతి పరీక్షలు రాయనున్నారని డీఈఓ కిష్టప్ప తెలిపారు. ఇప్పటికే 104 కేంద్రాలలో రోల్‌నెంబర్లను వేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యసదుపాయంతోపాటు విద్యార్థులకు గాలి, వెలుతురు వచ్చేలా ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లను 780 మందిని, ఎస్జీటీలను 424 మందిని నియమించినట్లు తెలిపారు. ఒక్కోగదిలో ఒక డెస్కుకు ఇద్దరు విద్యార్థులు మాత్రమే పరీక్షలు రాసేవిధంగా ఏర్పాట్లను చేశామని డీఈఓ తెలిపారు. ఈ పరీక్షలు 31వతేదీ వరకు జరుగుతాయని ఆయన తెలిపారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

పుట్టపర్తి రూరల్(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రత్న ప్రకటనలో పేర్కొన్నారు. 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ నెట్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గుంపులుగుంపులుగా ఉండరాదన్నారు. ఎండలు మండుతున్న దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.

ఇఫ్తార్ : 6.34 (సోమవారం సాయంత్రం) సెహరీ : 5.06 (మంగళవారం ఉదయం)

త్యాగానికి ప్రతిరూపం.. పొట్టి శ్రీరాములు

జేసీ అభిషేక్‌కుమార్



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ

పుట్టపర్తిటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతిరూపం అమరజీవి పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో వివిధ శాఖల అధికారులతో కలిసి జేసీ.. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి వెంకటనారాయణ, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9 ఏళ్లయినా..

ముందుకు సాగని రైల్వే బ్రిడ్జి పనులు

ప్రారంభంకాని చాకర్లపల్లి రైల్వేస్టేషన్

కేంద్ర మంత్రి హామీ నెరవేరేనా?



అర్ధంతరంగా ఆగిన రైల్వే బ్రిడ్జి నిర్మాణం

సోమందేపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా మండలంలోని చాకర్లపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ముందుకు సాగడంలేదు. మూడునెలల కిందట ఈబ్రిడ్జిని రైల్వే శాఖ సహాయమంత్రి సోమన్న ఎంపీ బీకే పార్థసారథితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చాకర్లపల్లి, సోమందేపల్లి, రంగేపల్లికి చెందిన పలువురు ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. చాకర్లపల్లి రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. టికెట్ కౌంటర్‌ను ప్రారంభించి గుంతకల్లు, బెంగళూరు ప్యాసింజర్ రైలు స్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమందేపల్లిలో అధికంగా చేనేత కార్మికులు ఉన్నారని, నేసిన వస్త్రాలను ఇతర ప్రాంతాలకు తరలించ డానికి రైలుద్వారా అయితే సులభంగా ఉంటుందన్నారు. అలాగే ఇక్కడి నుంచి అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం పెనుకొండ, హిందూపురం పట్టణాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, ఇలాంటి వారికి రైలు స్టేషన్‌లో ఆగితే ప్రయోజనకరంగా ఉంటుందని విన్నవించారు. స్థానిక పరిస్థితులను మంత్రికి ఎంపీ బీకే పార్థసారథి వివరించారు.

రూ.500 కోట్లు మంజూరు

చాకర్లపల్లి వద్ద రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం 2016లో రూ.500కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వ పాలనలో బీకే పార్థసారథి చొరవ చూపడంతో 2018-19 మధ్యలో బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా సాగింది. బ్రిడ్జి పూర్తయితే చాకర్లపల్లి రైల్వే గేటువద్ద గంటల తరబడి నిరీక్షణ తప్పుతుందని ప్రయాణికులు భావించారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం మళ్లీ టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడటంతో రైల్వే బ్రిడ్జి త్వరగా పూర్తవుతుందన్న ఆశ స్థానికుల్లో చిగురించింది. ఈక్రమంలోనే మంత్రి రేవణ్ణ రావడంతో తమ కష్టాలు గట్టెక్కి బ్రిడ్జి నిర్మాణంతోపాటు రైల్వే స్టేషన్‌లో అందుబాటులో ఉంటుందని భావించారు. మంత్రి రేవణ్ణ అప్పట్లో నెలలోపు చాకర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ప్రారంభించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తామని, టికెట్ కౌంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబరులోగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే నెలలు గడుస్తున్నాయి కానీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో విద్యార్థులు, చేనేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని రైల్వే స్టేషన్



రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ కష్టాలు

ప్రభలపై దేవదేవుడి వైభవం



చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన ఖాద్రీశుడు

7

మహిళలకు ఉక్కు కవచం శక్తి

మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత

7

ఆలయ భూమిపై వివాదం

ధర్మవరంరూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి):మండలంలోని నిమ్మలకుంట వద్ద ఉన్న ఆంజనేయస్వామి మాన్యంభూమి విషయమై ఆదివారం వివాదం తలెత్తింది. మాన్యం భూమిలోని దేవాలయంలో నివాసం ఉంటున్న శింగంశెట్టి కుళ్లాయప్పను ఖాళీచేసి వెళ్లిపోవాలని సీసీ కొత్తకోట గ్రామస్థులు నిలదీశారు. పోలీసులు, సీసీకొత్తకోట గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి సంబంధించి ఆంజనేయస్వామి మాన్యంభూమి నిమ్మలకుంట వద్ద సుమారు 22 ఎకరాలు ఉంది. 10 ఏళ్ల కిందట పట్టు పరిశ్రమ శాఖ రిటైర్డ్ అధికారి నిమ్మలకుంటకు చెందిన శింగంశెట్టి కుళ్లాయప్ప మాన్యం భూమిలోని చిన్నపాటి ఆంజనేయస్వామి దేవాలయాన్ని తొలగించి, నూతనంగా నిర్మించాడు. అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేసుకుని, ఆలయాన్ని పూర్తిస్థాయిలో స్వాధీనంలోకి తీసుకున్నాడు. 2.23 ఎకరాల ఆలయ భూమికి తన బంధువైన శింగంశెట్టి బాబు రాజేంద్రప్రసాద్ పేరుమీద పట్టా తెచ్చుకున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న సీసీ కొత్తకోట గ్రామస్థులు 50 మందిదాకా ఆలయం వద్దకు వెళ్లి, శింగంశెట్టి కుళ్లాయప్పతో వాగ్వాదానికి దిగారు. గ్రామానికి చెందిన మాన్యంభూమిలో పట్టా ఎలా తెచ్చుకున్నారని ప్రశ్నించారు. కల్యాణమండపంలోని సామగ్రిని బయటకు వేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ప్రభాకర్.. సిబ్బందితో అక్కడికి చేరుకుని, గ్రామస్థులతో మాట్లాడారు. దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో గ్రామస్థులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ ప్రభాకర్

ఆధ్యాత్మికతపై శిక్షణ



జ్యోతి వెలిగిస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవాదళ్‌కు వాహిణి సుధామృత పేరిట ఆధ్యాత్మికతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ ముగించుకున్న సేవాదళ్ సభ్యులకు ఆదివారం సర్టిఫికెట్లను శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి అందజేశారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో దీనిపై సదస్సు నిర్వహించారు. మొదట సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు వక్తలు సత్యసాయి సేవల గురించి ప్రసంగించారు. దాదాపు 10 భాషల్లో వాహిణి సుధామృత పేరిట ఆన్‌లైన్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఆధ్యాత్మికత, సామాజిక సేవలు, సత్యసాయి ప్రేమతత్వంపై బోధిస్తున్నట్లు రత్నాకర్ తెలిపారు.ఇప్పటివరకు 750మంది శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. మరో 1500 మంది పేర్లు నమోదు చేసుకున్నారని ఆయన వివరించారు. అనంతరం భక్తిపాటలు ఆలపించి, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.34 (సోమవారం సాయంత్రం) సెహరీ : 5.06 (మంగళవారం ఉదయం)

మరుగు ఏదీ..?

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కనిపించని తాత్కాలిక మరుగుదొడ్లు

ఇబ్బందులు పడుతున్న భక్తులు

పరాకాష్టకు చేరిన అధికారుల నిర్లక్ష్యం

కదిరి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్లు లేక ఖాద్రీశుడి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగు తున్నాయి. రోజురోజుకి భక్తుల తాకిడి పెరుగుతోంది. బ్రహ్మగరుడసేవ తరువాత భక్తులు ఆలయంలోనే బస చేస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఉన్న మరుగుదొడ్లు ఏమూలకు సరిపోవడం లేదు. కనీసం చుట్టుపక్కలకైనా వెళ్దామనుకుంటే ఎక్కడేగాని ఒక్క మరుగుదొడ్డి కనిపించదు. దీంతో భక్తులు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశంలో అధికారులు చెప్పిన హామీలు ఏవీ అమలుకు నోచుకోలేదు. తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులకు ఎమ్మెల్యే కందికుంట ప్రత్యేకంగా చెప్పినా, పట్టించుకోలేదు. బ్రహ్మరథోత్సవం నాటికి లక్షలమంది ఆలయానికి చేరుకుంటారు. మరుగుదొడ్లు లేకపోతే ఆలయ ఆవరణతోపాటు, చుట్టుపక్కల తిరువీధులు కూడా కంపు కొట్టే ప్రమాదం ఉంది.

కనిపించని తాత్కాలిక మరుగుదొడ్లు

బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశంలో తాత్కాలికంగా 30 మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు చెప్పారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యి 8 రోజులు పూర్తయినా ఆ ఏర్పాట్లు ఇంతవరకూ ఎక్కడా కనిపించలేదు. ఆలయం వెనుక పార్కు ప్రాంతంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి ఉంటే ఎంతో సౌకర్యంగా ఉండేది. టీటీడీ కల్యాణమండం వద్ద కూడా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు అవకాశముంది. గొల్లమ్మ మండపానికి సమీపంలో, శివాలయానికి సమీపంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసే అవకాశముంది. దీంతోపాటు కోనేరుకు సమీపలో కూడా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. లేకపోతే లక్షలాదిగా వచ్చే భక్తులు మలమూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడతారు. అధికా రుల నిర్లక్ష్యంపై పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కోనేరు ఎదురుగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు

ఎక్కడబడితే అక్కడే

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఇప్పటికే వేలాదిమంది భక్తులు పగలు, రాత్రి తేడాలేకుండా ఆలయంలో ఉంటున్నారు. ఉన్న నాలుగు మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏమూలకు సరిపోవడం లేదు. దీంతో కొందరు భక్తులు ఎక్కడబడితే అక్కడ మలమూత్రాలు విసర్జిస్తున్నారు. ఆలయ ఆవరణలోని స్నానపుగదుల వద్ద ఇది జరుగుతోంది. దీంతో ఆలయ ప్రాంగణం అపరిశుభ్రంగా మారుతోంది. కొంతమంది కోనేరు పరిసర ప్రాంతాలు, టీటీడీ కల్యాణమండపం, పార్కు ప్రాంతాల్లోకి వెళ్తున్నారు. పురుషులు ఏడేలా నెట్టుకొస్తున్నా, మహిళలు, వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంది. నరసింహస్వామి పార్కు స్థలంలో ఎప్పుడో ఏర్పాటు చేసిన నాలుగు మరుగుదొడ్లను తాత్కాలికంగా సిద్ధం చేశారు. కానీ, అవి ఏమాత్రం సరిపోవడంలేదు. పురుషులకు రెండు, మహిళలకు మూడు మాత్రమే ఉన్నాయి.

పూర్తి చేస్తాం

బ్రహ్మరథోత్సవం నాటికి తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కోనేరు ఎదురుగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. మరికొన్ని బ్రహ్మరథోత్సవం నాటికి ఏర్పాటు చేస్తాం.

- శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ

ఆలయ అధికారులకు సహకరిస్తాం

ఆలయ అధికారులు తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తే అందుకు అవసరమైన నీటిని అందిస్తాం. మురుగును తొలగించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తాం. బ్రహ్మరథోత్సవానికి మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అధికారులు చెప్పారు. వారికి సహకరిస్తాం.

-కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మరుగుదొడ్ల లేక ఇబ్బందులు

రెండు రోజుల కిందట స్వామివారి దర్శనానికి వచ్చా. ఆలయంలో ఉండే మరుగుదొడ్లు సరిపోవడంలేదు. మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడ్డాం. మరిన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

- నాగభూషణం, భక్తుడు, మడకశిర

ఫటాఫట్

పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

కాపీయింగ్‌కు తావుండదు

'ఆంధ్రజ్యోతి'తో ఆర్జేడీ శామ్యూల్



అనంతపురం విద్య, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టామనీ, ఎక్కడా కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా నిర్వహిస్తామని కడప ఆర్జేడీ శామ్యూల్ పేర్కొన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, పరీక్షలు పకడ్బందీగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షల డ్యూటీలో పాల్గొనే ఇన్విజిలేటర్లు, సీఎస్, డీఓలు, ఇతర సిబ్బందికి ప్రతి రూపాయీ అందేలా చూస్తామని తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆంధ్రజ్యోతికి ఆయన పలు వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: టెన్త్ క్లాస్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఎలాంటి ప్రణాళిక అమలు చేస్తున్నారు?

ఆర్జేడీ: పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవి. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరిగినపుడు విద్యార్థుల్లోని ప్రతిభ బయటపడుంది. ఓపెన్ ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాం. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లలో స్ట్రిక్ట్‌గా ఉండే అధికారులను నియమించి, కట్టుదిట్టం చేశారు. పది పరీక్షల్లో సైతం ఇదే ఫార్ములాతో ముందుకెళ్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గతంలో పది పరీక్షల్లో ప్రశ్నపత్రాలు తారుమారైన ఘటనలున్నాయి. ఈ ఏడాది ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు..?

ఆర్జేడీ: గతంలోని సంఘటనలు నా దృష్టిలో లేవు. ఈ ఏడాది ఎలాంటి చిన్న సమస్య తలెత్తకుండా చూడాలని డీఈఓ, ఏసీలకు ఆదేశాలిచ్చాం. ప్రధానంగా 135 కేంద్రాల్లోని సీఎస్‌లు, డీఓలు ఉదయం 8 గంటలకే పోలీసు స్టేషన్ల వద్దకెళ్లాలి. 8.30 గంటలు లేదా 9 గంటలకు వెళ్తే హడావుడిలో పొరబాట్లు దొర్లే ప్రమాదం ఉంది. గంట ముందుగా ఉంటే ఏ సమస్యా రాదు.

ఆంధ్రజ్యోతి: గతంలో 10 పరీక్షల డ్యూటీ రెమ్యూనరేషన్, టీఏ, డీఓలు సక్రమంగా అందలేదు. దీన్ని ఎలా పరిష్కరిస్తారు?

ఆర్జేడీ: పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం బడ్జెట్ ఇస్తోంది. ఈ ఏడాది ఆర్జేడీగా నేను పర్యవేక్షిస్తా. బడ్జెట్ తక్కువైతే మళ్లీ అయినా తెప్పించుకుంటాం. పరీక్షల విధుల్లో పాల్గొనే సీఎస్, డీఓ, ఇన్విజిలేటర్లకు, స్పాట్‌లో పాల్గొనే ఎగ్జామినర్లకు, ఇతర సిబ్బందికి ఇబ్బందులు రాకుండా చూస్తాం. పరీక్షలు, స్పాట్ సిబ్బందికి అందాల్సిన రెమ్యూనరేషన్, టీఏ, డీఏ ఇతర ఏ బిల్లులు ఒక్క రూపాయి కూడా మిస్ కాకుండా చూస్తాం.

ప్రైవేటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరెస్టు

కదిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతిని ఆదివారం స్థానిక కోనేరు సర్కిల్ బస్టాప్ వద్ద అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఓ డిగ్రీ కళాశాలలో హోలీ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటపతి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ నిందితుడికి రిమాండ్ విధించారు. నిందితుడిని కదిరి సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

439 జీఓపై హర్షం

- ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ శర్మ

గుంతకల్లు, మార్చి15(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో బ్రాహ్మణులకు అర్చకత్వాన్ని పారంపర్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 439 జీఓ తీసుకురావడంపై హర్షణీయమని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ శర్మ పేర్కొన్నారు. కసాపురంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా కే సతీశ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్కే మనోహర్ రావు, కోశాధికారిగా పులిబాక ప్రసాద్‌ను ఎంపికచేశారు. కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు ఎస్ దుర్గా ప్రసాద్, వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మా బిడ్డ మృతిపై అనుమానాలు

సెంట్రల్ వర్సిటీ అధ్యాపకురాలు యోజిత తల్లిదండ్రులు

అనంతపురం సెంట్రల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ యోజిత సాహా మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రంలోని అద్దె ఇంటిలో ఆత్మహత్య చేసుకున్న సెంట్రల్ వర్సిటీ అధ్యాపకురాలు యోజిత సాహా మృతదేహానికి ఆదివారం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన యోజిత సాహా తల్లిదండ్రులు పుష్ప సాహా, నందకుమార్ సాహా ఆసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. యోజిత సాహాకు చెందిన ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లను తల్లిదండ్రుల సమక్షంలో పోలీసులు తెరిచే ప్రయత్నం చేశారు. ల్యాప్‌టాప్‌కు ఫింగర్ ప్రింట్, ఫోన్‌కు ఫేస్ రికగ్నైజేషన్ లాక్‌లు పెట్టడంతో ఓపెన్ కాలేదు. వాటిని టెక్నికల్ విభాగానికి పంపుతామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ యోజిత సాహా మృతిపై అనుమానం ఉందని, త్వరగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. యోజితకు చివరగా తల్లి పుష్ప సాహా ఫోన్ చేసిందన్నారు. స్పందించకపోవడంతో వర్సిటీలోని ఒక విద్యార్థికి ఫోన్‌చేసి విషయం తెలపడంతో ఇంటికెళ్లి చూసినట్లు తెలిపారు. అప్పటికే యోజిత ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారన్నారు. విచారణ ప్రారంభించినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రభలపై దేవదేవుడి వైభవం





సూర్య, చంద్రప్రభ వాహనాలపై విహరిస్తున్న ఖాద్రీశుడు

కదిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పగటికి అధిపతి సూర్యుడు. రేయికి రారాజు చంద్రుడు. రేయింబవళ్లు కాలాదీనాలనీ, వాటితోపాటు సమస్త విశ్వానికి తానే అధిపతినని చాటి చెప్పే విధంగా లక్ష్మీనారసింహుడు ఆదివారం సూర్య చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజాహోమం అనంతరం సూర్యప్రభ వాహనం పై తిరువీధుల్లో ఊరేగారు. సంధ్యాసమయంలో చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాలు, రంగురంగుల పూలతో అలంకరించిన వాహనాలను అధిరోహించిన శ్రీవారిని దర్శించుకోవడానికి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీవారి ఉత్సవానికి ముందుభాగంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు మోహినీ ఉత్సవం


శ్రీఖాద్రీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు.. మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. స్వామివారి వెనుకభాగంలో ఉండే వాలు జడ ఉత్సవం ప్రత్యేకం. కదిరి మల్లెల సౌరభం ఈ ఉత్సవంలో గుబాళించనుంది.

శ్రీవారిని దర్శించుకున్న కలెక్టర్

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కలెక్టర్ టీఎస్ చేతన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. కలెక్టర్‌కు శ్వేత వస్త్రాన్ని కప్పి సన్మానించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందించారు. ప్రధానార్చకుడు నరసింహాచారులు స్వామివారి ఆశీస్సులు అందజేశారు.

ఎండుతున్న మిరప..!

- దారుణంగా పడిపోయిన మిరప ధర
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- తక్కువ ధరకే అమ్ముకుందామన్నా కొనేవారు కరువు
- పొలాల్లోనే దిగుబడులు
- ఆందోళనలో అన్నదాతలు





ఆరబెట్టిన మిరప కాయలు

ఉరవకొండ, మార్చి16(ఆంధ్రజ్యోతి): రైతు కష్టం.. చెల్లని కాసు అవుతోంది. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనేవారు లేరు. పంటను అమ్ముకోలేక రైతు దిక్కులు చూస్తున్నాడు. పంట దిగుబడిని పొలంలోనే ఉంచుకుని, కొనేవారి కోసం ఎదురుచూపులు చూస్తున్నాడు. అందినకాడికి అమ్ముకుందామన్నా.. కనీసం అడిగే నాథుడేలేడని ఎండుమిర్చి రైతులు వాపోతున్నారు. మిర్చి ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులకు ఈ దుస్థితి దాపురించింది. గతేడాది పంట ఇంకా శీతల గిడ్డంగుల్లో మూలుగుతోంది. ఈ ఏడాది తెగుళ్లు ఉధృతంగా దాడి చేయడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది. పంట చేతికి వచ్చే సమయంలో ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో చేసేదిలేక రైతులు పొలాల్లోనే రాశులు పోసుకుని, అమ్ముకునేందుకే అవస్థలు పడుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

ఉరవకొండ ప్రాంతంలో అధికంగా ఎండుమిరప సాగు చేస్తున్నారు. హంద్రీనీవా, జీబీసీ, హెచ్చెల్సీ కింద ఈ ఏడాది 30వేల ఎకరాలకుపైగా పంట పెట్టారు. హంద్రీనీవా కాలువకు నీరు వచ్చినప్పట్నుంచి మిరప సాగు పెరుగుతోంది. ఎకరాకు కౌలుతో కలుపుకుని రూ.2లక్షలదాకా పెట్టుబడులు పెట్టారు. కూలీల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. రెండేళ్ల క్రితం మిరపలోని డబ్బీ, బ్యాడిగ రకాలు క్వింటా రూ.70 వేల దాకా ధర పలికాయి. డబ్బీ, బ్యాడిగ రకాలు సాధారణంగా రూ.40 వేలకు తగ్గలేదు. అలాంటివి కూడా ప్రస్తుతం రూ.20 వేలు ధర పలుకుతున్నాయి. అందులో కూడా కాయ రకాన్ని బట్టి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే క్వింటాకు రైతులు రూ.50వేలదాకా నష్టపోతున్నారు. సీడ్స్ రకాలు క్వింటా రూ.10 వేల నుంచి రూ.14 వేలలోపే పలుకుతున్నాయి. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఎకరాకు రూ.40వేలు కౌలు చెల్లించి, పంట పెట్టారు. ప్రస్తుత ధరలతో ఎకరాకు అదనంగా రూ.70వేలదాకా నష్టపోతున్నారు. దిగుబడి కూడా తగ్గిందని రైతులు వాపోతున్నారు.

పేరుకుపోయిన నిల్వలు

మిర్చి ధరలు గతేడాది అమాంతం పడిపోవడంతో కోల్డ్ స్టోరేజీల్లోనే రైతులు నిల్వ చేసుకున్నారు. ఈసారి మిర్చి కోతలు ప్రారంభమయ్యాక పాతకాయలను అడిగేవారే కరువయ్యారు. కోల్డ్ స్టోరేజీల్లో 2.4 లక్షల క్వింటాళ్ల మిరప నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్వింటా రూ.10 వేలకు కూడా అడిగే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజీల్లో మిర్చిని నిల్వ చేయలేక, వాటి అద్దె చెల్లింపులకు కూడా డబ్బుల్లేక, ఎక్కువ రోజులు ఉంచితే బూజు పడుతుందన్న ఉద్దేశంతో దళారులు చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది.

శీతల గిడ్డంగులు లేక ఇబ్బందులు

మిరప పంట దిగుబడులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన శీతల గిడ్డంగులు ఇక్కడ ఐదు మండలాల్లోనూ లేవు. దీంతో రైతులు కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు తరలించి, అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. బ్యాడిగి ప్రాంతానికి తీసుకెళ్తే అక్కడ నిల్వ ఉంచుకునే అవకాశం ఉండదు. మిరప పాడైనా దిక్కుండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉరవకొండలో విశాలమైన మార్కెట్ ప్రాంగణం ఉంది. ఇక్కడ క్రయవిక్రయాలు జరగవు. పెద్ద గోదాములు ఉన్నా వాటిని సాధారణ అద్దెకు బయటి వ్యక్తులకు ఇస్తున్నారు. దీంతో చాలామంది రైతులు పొలాల్లో చెట్ల కింద పంట దిగుబడిని నిల్వ చేయలేక తక్కువ ధరలకు విక్రయించుకుంటున్నారు.



కొనేవారే లేరు

12 ఎకరాల్లో మిరప సాగు చేశా. ఎకరాకు రూ.2లక్షలదాకా పెట్టుబడులు పెట్టా. కౌలు రూ.40వేలదాకా చెల్లించా. అమ్ముదామన్నా కొనేవారులేరు. దిగుబడి అంతంత మాత్రమే. క్వింటా రూ.20వేలకు మించి అడగడం లేదు.

- సుందర్‌రాజు, రైతు, వేల్పుమడుగు

అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టా

ఏడెకరాల్లో మిరప సాగు చేశా. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టా. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోయాయి. పెరుగుతాయన్న ఆశతో కోల్డ్ స్టోరేజీలో ఏడాదిగా దిగుబడిని నిల్వచేశా. గత్యంతరం లేక క్వింటా రూ.15 వేలకే పది రోజుల క్రితం అమ్మేశా. వ్యాపారులు అడిగిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది.

- రాంబాబు, రైతు, నింబగల్లు



మహిళలకు ఉక్కు కవచం శక్తి

మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత





మహిళా అధికారులు, ప్రముఖులతో మంత్రి, ఎమ్మెల్యే సెల్ఫీ

శక్తి యాప్‌ను ఆవిష్కరిస్తూ..

పెనుకొండ టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉక్కుకవచం శక్తి యాప్ అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 25 మంది మహిళలను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్పీ రత్న, షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగ, వ్యాపార, రాజకీయ తదితర అన్నిరంగాల్లో మహిళలు ముందుండాలన్నారు. కుటుంబ పోషణలో చేదోడువాదోడుగా ఉండాలని సూచించారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. మహిళలు ధైర్యంతో ముందడుగు వేయాలన్నారు. తన భర్త పరిటాల రవి ఎమ్మెల్యేగా ఉన్నపుడు తాను గృహిణిగా ఇంటికొచ్చిన వారికి అతిథి మర్యాదలు చేసేదానినన్నారు. భర్త మరణానంతరం రాజకీయాల్లోకి అడుగు పెట్టి రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానన్నారు. అనంతరం శక్తి యాప్‌ను ఆవిష్కరించారు. అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే, మంత్రి సన్మానించి, మొమెంటోలు అందించారు.

సైబర్ నేరగాళ్ల వలలో ఎల్ఐ

రూ.50వేలు పోగొట్టుకున్న వైనం

ధర్మవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ లైన్ ఇన్‌స్పెక్టర్ (ఎల్ఐ)మోసపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల మేరకు...డీ-1 సెక్షన్‌లో నాగరాజు లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సైబర్‌నేరగాళ్లు ఏఈ నాగభూషణంకు శనివారం ఫోన్‌చేసి తాము ఏసీబీ డీఎస్పీ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ కార్యాలయంలో సీనియర్ ఉద్యోగి పేరు చెప్పాలని అడిగారు. దీంతో ఆయన ఇది నిజమని నమ్మి లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పేరు చెప్పారు. ఆయనకు వెంటనే లైన్ కలపాలని సైబర్ నేరగాళ్లు ఆదేశించారు. ఏఈ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు లైన్ కలపగా 'మీరు చాలా అక్రమాలకు పాల్పడ్డారని, మీపై చర్యలు తీసుకుంటామని' బెదిరించారు. లేదంటే రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన దగ్గర అంత డబ్బు లేదని నాగరాజు చెప్పాడు. కనీసం రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇస్తానని చెప్పగా, వెంటనే ఎవరికి చెప్పకుండా రూ.50వేలు ఫోన్ పే చేయాలని సూచించారు. నాగరాజు వారు చెప్పినట్లే చేశాడు. తర్వాత ఆరా తీసి తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బ్రహ్మంనాయుడు కోసం గాలింపు

రూ.92లక్షలతో ఉడాయింపు



బ్రహ్మంనాయుడు

అనంతపురం క్రైం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని హార్మోన్‌సిటీకి సంస్థకు చెందిన డబ్బును పెద్ద మొత్తంలో తీసుకుని ఉడాయించిన బ్రహ్మంనాయుడు కోసం అనంతపురం రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మదీనాగూడ తిరుమలగిరి కాలనీకి చెందిన బ్రహ్మంనాయుడు 2021లో సంస్థలో జనరల్ మేనేజర్‌గా పని చేశాడు. ఆ సమయంలో సంస్థకు చెందిన రూ.92లక్షలు కాజేసి, పరారయ్యాడు. ఈ ఘటనపై సంస్థ ఎండీ రవికుమార్ అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు బ్రహ్మంనాయుడుపై చీటింగ్ కేసు నమోదు చేశారు. అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని బ్రహ్మంనాయుడు నివాసానికి నోటీసు అతికించారు.

టీడీపీ కార్యకర్త చీనీచెట్ల నరికివేత

పరిశీలించిన నాయకులు



నరికేసిన చీనీచెట్లు

పుట్లూరు, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్త నాగరాజుకు చెందిన చీనీచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. నాగరాజు నాలుగు ఎకరాల్లో 500చీనీచెట్లను సాగు చేశాడు. వీటిలో మూడేళ్ల వయసున్న 110 చెట్లను ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేసినట్లు తెలిపారు. ఉదయం తోట వద్దకు వెళ్లిన నాగరాజుకు నరికివేసిన చెట్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు పరిశీలించారు.

నీచమైన సంస్కృతి : టీడీపీ నేతలు

చెట్లు నరికివేయడం నీచమైన సంస్కృతి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మండిపడ్డారు. గరుగుచింతలపల్లిలో నరికివేసిన చీనీచెట్లను ఆదివారం పరిశీలించారు. బాధితుడికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట మండల కన్వీనర్ బాలరంగయ్య, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, ఐ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, రామాంజనేయులు, చంద్ర, సోము, బ్రహ్మయ్య ఉన్నారు.

వాహనం బోల్తా

25మందికి గాయాలు.. సీమంతానికి వెళ్తుండగా ప్రమాదం



ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులు

ఉరవకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు సమీపం లో జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనం బోల్తా పడటంతో 25 మంది గాయపడ్డారు. బొమ్మనహాళ్ మండలం హరేసముద్రం గ్రామానికి చెందిన వారు ఉరవకొండ మండలంలోని మోపిడి గ్రామంలో రామాంజనేయులు ఇంట్లో జరిగే సీమంతం కార్యక్రమానికి టాటాఏస్ వాహనంలో బయలుదేరారు. చిన్నముష్టూరు సమీపంలో ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో వరుణ్, వినిత, నాగలక్ష్మి, లక్ష్మీ, మేఘన, వనిత, చంద్రమ్మ, నాగమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం, బళ్లారి ఆసుపత్రులకు తరలించారు. ఎస్ఐ జనార్దననాయుడు కేసు దర్యాప్తు చేపట్టారు.

హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ ఎత్తివేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్‌పై కేంద్రం విధిస్తున్న జీఎస్టీ ఎత్తివేయాలని ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వారణాసి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హాల్‌లో ఆదివారం ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఏటా ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ రివిజన్ చేయాలని, పెన్షన్ నిధులు పెంచాలన్నారు. యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ జితేంద్రకుమార్ మిశ్రా మాట్లాడుతూ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను అటు బ్యాంకు ఉన్నతాధికారులు, కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు కె.రామచందర్, రమణ, కొండలరావు, శ్రీనివాస్, యదుభూషణ్ రెడ్డి, చంద్రశేఖర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సహర్ (మంగళవారం ఉదయం)
కదిరి:	6.31	5.08
ధర్మవరం:	6.33	5.05

పట్టించుకునేవారెవరు..?

• ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం • పూర్తయినా ప్రారంభానికి నోచుకోని 'తహసీల్దార్' భవనం

తాడిమర్రి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆగిపోయాయి. రాష్ట్రంలో మళ్లీ కొత్త ప్రభుత్వం ఏర్పాటై.. సంవత్సరం అవుతున్నా.. ఆగిపోయిన అభివృద్ధి పనుల గురించి.. పట్టించుకునేవారే కరువయ్యారు. ఏకపాదంపల్లి గ్రామంలో రూ. ఆరు లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి.. తుది మెరుగులుదుద్ది ప్రారంభించాల్సి ఉంది. అలాగే తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో 2014-19 అప్పటి ప్రభుత్వం నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించింది. నిర్మాణం పూర్తయినా.. దాన్ని నేటికీ ప్రారంభించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో.. ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. వీటి గురించి ఇటు పాలకులు.. అటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక ఎవరికి చెప్పాలో అర్థం కాని అయోమయంలో పడిపోయారు.


ఏకపాదంపల్లి వద్ద ఆగిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం


ప్రారంభానికి నోచుకోని తహసీల్దార్ కార్యాలయం


శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ భవనం

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ధర్మవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి.. ప్రాణాలు సైతం త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద మంత్రి సత్యకుమార్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, అనంతపురం జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకాచంద్ర, గొట్లూరు చంద్ర నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరే గోపాలక్రిష్ణ, పణికుమార్, పురుషోత్తంగౌడ్, విశ్వహిందూపరిషత్ సభ్యులు నివాళులర్పించారు.

● పుట్టపర్తి రూరల్ : జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్పీ రత్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇం దులో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, మహేష్ పాల్గొన్నారు.

● బుక్కపట్నం : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టిశ్రీరాముల విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి పోలేపల్లి ప్రశాంత్‌కుమార్, సంఘం నాయకులు చంద్రశేఖర్, రమేష్, తేజా, నాగభూషణం పాల్గొన్నారు.





పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్, జనసేన నేత చిలకం, చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

మౌలిక వసతులు కల్పిస్తాం

● తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి
● సమస్యలపై 9490610505కు ఫిర్యాదు చేయండి
● ఎంపీడీఓ సాయిమనోహర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ధర్మవరంరూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనే మా లక్ష్యం. వేసవిలో జీవనాధార కార్యక్రమంతో తాగునీటి సమస్య ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తున్నాం. ప్రజల వారి సమస్యలు దృష్టికి నేరుగా తేస్తే వెంటనే పరిష్కారిస్తాం. మండల ప్రజల సమస్యలు పరిష్కారం కోసం ప్రతిరోజూ డయల్ యువర్ ఎంపీడీఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో సమస్యలుంటే 94906 10505 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేస్తే... వెంటనే ఆ సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.' అని ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన పలు ప్రశ్నలకు ఇలా సమాధానాలిచ్చారు..

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఏఏ చర్యలు తీసుకున్నారు...?
జవాబు : జీవనాధార కార్యక్రమంతో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేశాం. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే 94943 69273కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే ఆ సమస్యను పరిష్కారిస్తాం.

ప్రశ్న : గ్రామాల అభివృద్ధికి చేపట్టిన చర్యలు వివరిస్తారా..?
జవాబు : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశాం. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగించాం. రహదారుల మరమ్మతులు, నీటికుంటలు, గోకులంషెడ్లు తదితర వాటిని చేపట్టాం.

ప్రశ్న : స్వచ్ఛాంధ్రను ఏవిధంగా అమలు చేస్తున్నారు..?
జవాబు : జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. గ్రామాల్లో చెత్తసేకరణ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చాం. స్వచ్ఛభారత్ కార్మికుల ద్వారా గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్తను సేకరించి వాటిని కేంద్రాలను చేర్చే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. గ్రామపరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : సబ్సిడీ రుణాల ప్రక్రియ ఎంతవరకు వచ్చింది..?
జవాబు : మండలానికి 62 సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయి. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారిని బ్యాంకర్లు ఇంటర్వ్యూలు చేశాం. అర్హులైన లబ్ధిదారుల జాబితా తయారు చేసి త్వరలోనే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తాం.

ప్రశ్న : నిధులు ఎంతమేర విడుదలయ్యాయి..?
జవాబు : గ్రామాల అభివృద్ధి కోసం 15వ ఆర్థికసంఘం నిధులు ఇటీవల 8.50 లక్షల వరకు విడుదల అయ్యాయి. ఈ నిధులను గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తాం.

ప్రశ్న : సర్పంచ్‌ల భాగస్వాములు చేస్తున్నారా..?
జవాబు : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రధానంగా సర్పంచ్‌ల సమన్వయంతో కృషి చేస్తున్నాం. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర. వచ్చే నెలలో 15వ ఆర్థికసంఘం నిధులు మరోసారి విడుదల అవుతాయి. ప్రతిగ్రామపంచాయతీకి జనాభా ప్రతిపాదికన నిధులు ఇస్తాం. అత్యవసరంగా ఏదైనా గ్రామాలకు నిధులు కావాలన్నా వాటికి సమకూర్చి ప్రజలకు ఇబ్బందిలేకుండా చేస్తాం.

ప్రశ్న : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించలేదని వస్తున్న ఫిర్యాదులపై మీరేమంటారు.?
జవాబు : సచివాలయ ఉద్యోగులు తప్పకుండా సమయపాలన పాటించాలి. ఇటీవల ఆంధ్రజ్యోతిలో బడన్నపల్లి సచివాలయ ఉద్యోగులు ఆలస్యంగా వస్తున్నారని వచ్చిన వార్త కథనంపై ఆ సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీచేశాం. ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని ఆదేశించాం.

ప్రశ్న : ఉపాధి కూలీలకు వసతులు కల్పిస్తున్నారా...?
జవాబు : ఉపాధి హామీ పనుల కూలీలకు తాగునీటి సౌకర్యం... వసతులు కల్పిస్తున్నాం. ఎండలు పెరుగడంతో ఉదయాన్నే వచ్చి పనులు చేసుకొని వెళ్లవచ్చు. కూలీలకు వేతనాలు కూడా త్వరలోనే జమ అవుతాయి.

ప్రశ్న: శ్మశానవాటికల అభివృద్ధికి తీసుకున్న చర్యలు ?
జవాబు: గ్రామాల్లో శ్మశానవాటికల చుట్టూ ఫెన్సింగ్, అక్కడ కార్యక్రమాల కోసం రూమ్‌లు ఏర్పాటు చేశాం. ఉప్పునేసినపల్లి శ్మశానవాటిక వద్ద రచ్చకట్టలాగా ఏర్పాటుచేశాం.

ప్రశ్న : చెరువుల్లో చేపల పెంపకం కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారా..?
జవాబు: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద పోతుకుంట, గొట్లూరు చెరువుల్లో చేపలను వదిలాం. చెరువుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. బోటులు, పార్కులు ఏర్పాటు చేశాం. సందర్శకులను నుంచి వచ్చే డబ్బుతో చెరువులను అభివృద్ధి చేస్తాం.

న్యూస్ బాక్స్

కాలువ లైనింగ్ పనులు ఆపాలి

ధర్మవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే ఆపాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షుడు హరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. లైనింగ్ పనుల వల్ల భూగర్భజలాలు అడుగంటి పోయి జిల్లా ఎడారిగా మారుతుందన్నారు. ఈ లైనింగ్ పనుల వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగమూ లేదన్నారు. దీనికి పెట్టె ఖర్చుతో కాల్వను వెడల్పు చేసి మారుమూల ప్రాంతాలకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మారుతి, కదిరెప్ప, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తనకల్లు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో సోమవారం నుంచి పది పరీక్షలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారని ఎంఈఓ లలితమ్మ ఆదివారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 210 మంది, కేజీబీవీలో 200 మంది.. మొత్తం 410 మంది ఈ పరీక్ష రాస్తారన్నారు.

● నల్లమాడ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో పది పరీక్షలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ వేమనారాయణ ఆదివారం ఒక్రప్రకటనలో తెలిపారు.

విచారణ ప్రారంభం

తనకల్లు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం తెలిసిందే. హాజరు పట్టికలో ఉపాధ్యాయులు రెండు రోజులు ముందుగానే హాజరు వేసిన విషయం వెలుగుచూసింది. దీంతో ఆదివారం గిరిజన బాలికల గురుకుల పాఠశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ మురళీశ్రీనివాస్ ఆ పాఠశాలకు వెళ్లి విచారణ చేట్టారు. స్టడీకి నియమించిన ఉపాధ్యాయులిలా వాటికి డమ్మా కొట్టినట్లు గుర్తించారు. ఈ విషయాలపై సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట పాఠశాల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సోంపాళ్యం నాగభూషణం ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

బత్తలపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్రాచెరువు గ్రామంలో నూతన 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, ఏఈ కార్యాలయాన్ని మంత్రి సత్యకుమార్ ఆదివారం ప్రారంభించాడు. రైతులకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నాడు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో అప్రాచెరువు, జ్వాలాపురం, చెన్నరాయపట్న గ్రామాలకు త్రిఫేస్ విద్యుత్ నిరంతరాయంగా అందుతుందన్నారు. అనంతరం నూతన బోరును వేసేందుకు భూమి పూజ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

● ధర్మవరం: నియోజకవర్గంలోని ఎనిమిది మంది అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.47 లక్షలు మంజూరైంది. ఆ చెక్కులను మంత్రి సత్యకుమార్ స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం వారికి అందజేశారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

గాండ్లపెంట, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల పంచాయతీ సీ.ఎం. తండాలో నాటుసారా నిర్మూలనపై ఆదివారం ఎక్సైజ్ అధికారులు ఆధ్వర్యంలో కళాజాత బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమద్దయ్య, ఎస్ఐలు శ్రీధర్, దత్తాత్రేయ, జిల్లా టాస్క్ పోలీస్ ఎస్ఐ హరిక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి: సీపీఐ

ఓబుళదేవరచెరువు, మార్చి16(ఆంధ్రజ్యోతి): సీపీఐ నేతలపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడడం నేర్చుకోవాలని పసుపులేటి రమేష్‌కు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, మండల కార్యదర్శి చలపతినాయుడు హితవు పలికారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. ముదిగుబ్బ ఎంపీపీ గిరిజన భూములను ఆక్రమించడంతో న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయంలో పసుపులేటి రమేష్ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు.

మతసామరస్యానికి ప్రతీక పెనుకొండ: మంత్రి

● ఘనంగా పార్శ్వనాథ ఆలయ వార్షికోత్సవం


స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పెనుకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక పెనుకొండ అని హిందూ, ముస్లిం, జైన మతస్థులకు నిలయంగా వెలుగొందుతోందని మంత్రి సవిత అన్నారు. ఆదివారం స్థానిక పశ్వాపార్శ్వనాథస్వామి జైన ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు జీనచంద్రయ్య, బ్రహ్మానంద, అజితప్రసాద్, ఆదిదినేష్ ఆధ్వర్యంలో స్వామివారికి 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథులుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రకీర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెనుకొండ మతసామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలకు దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిచెందిన బాబయ్యదర్గా హిందువులకు సంబంధించిన 365దేవాలయాలతోపాటు భారతదేశంలోనే నాలుగు జైన పీఠాల్లో ఒకటి పెనుకొండలో ఉండటం గర్వకారణమన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చంద్రకీర్తి, రాజన్, పద్మప్రభ, సురేష్‌కుమార్, సుందరరామయ్య, పార్శ్వనాథ్ వేదలవేణి హాజరయ్యారు.

20న జాబ్‌మేళా

మడకశిరటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఎస్వైటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 20వతేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారికి సత్యసాయి జిల్లా పరిధితోపాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నారాయణ స్వామి (ఫైల్)

ధర్మవరంరూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని కరెంట్ ఆఫీసు మార్కెట్‌వీధి వాసి బోయ నారాయణస్వామి (54) అక్కడికక్కడే మరణించాడు. ఇతను ఓ ప్రైవేటు పాఠశాల టీచర్. ఆదివారం రాత్రి ధర్మవరం నుంచి అనంతపురానికి తన ద్విచక్రవాహనంలో సాంబశివుడు అనే వ్యక్తితో కలిసి బయలుదేరాడు. చిగిచెర్ల గ్రామ సమీపం.. మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా.. వేగంగా వెళ్లాడు. దీంతో బైక్ అదుపు తప్పి.. కల్వర్టు గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నారాయణస్వామి అక్కడికక్కడే మరణించాడు. సాంబశివుడు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేసుకొని.. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. నారాయణస్వామికి భార్య అరుణ, ఒక కుమారుడు దుర్గానీరాజ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడి మృతి


రమేశ్ నాయుడు (ఫైల్)

తాడిమర్రి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలం తురకవారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తమ్మినేని రమేశ్‌నాయుడు(42) బెంగళూరులో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. లింగాల మండలం పార్నపల్లి వద్ద ఈనెల 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. రమేశ్‌నాయుడికి భార్య హర్షిణి, కుమార్తె శిరివల్లి, కుమారుడు వర్షిల్ ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం ధర్మవరం ప్రభుత్వ వైద్యశాలలో రమేశ్‌నాయుడి మృతదేహానికి మంత్రి సత్యకుమార్ నివాళులర్పించారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ బాధిత కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు.

వ్యక్తి ఆత్మహత్య

బత్తలపల్లి మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బేకరి దుకాణాదారుడు జయప్రకాష్ (50) ఆదివారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను 30 సంవత్సరాలుగా ఇక్కడ బేకరి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. కొద్దిరోజులుగా వ్యాపారం సరిగా జరగకపోవడం.. రోడ్డు విస్తరణలో ఆ షాపు తొలగిస్తుండడంతో రోజూ కుటుంబ సభ్యుల వద్ద దిగులు చెందేవాడు. కుటుంబ సభ్యులు శనివారం బంధువుల ఊరికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న జయప్రకాశ్.. ఆదివారం తెల్లవారుజామున బేకరికి సంబంధించిన షెడ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన పనివాళ్లు .. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా, జయప్రకాష్‌కు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

విద్యుత్ మోటారు చోరీ

గాండ్లపెంట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలో సత్యసాయి పంప్‌హౌస్ విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. ఆ పంచాయతీకి తాగునీరు అందించేందుకు సత్యసాయి పంప్‌హౌస్‌లో 25 హెచ్‌పీ విద్యుత్ మోటారు అమర్చారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని చోరీ చేశారు. ఆదివారం ఈ విషయాన్ని గుర్తించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి

ధర్మవరంరూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ సమాధుల వద్ద ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో నిల్చోని అవస్థలు పడుతున్నారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికులు దిగి బత్తలపల్లి వైపు వెళ్లే ప్రయాణికులు కదిరి గేటుకు వెళ్లే సమాధుల వద్ద బస్టాప్ వద్ద బస్సులు, ఆటోలను ఎక్కుతారు. అయితే ఆ ప్రాంతంలో ఎక్కడ కూడా కనీసం కూర్చోవడానికి చెట్టు నీడ కూడా లేదు. గ్రామీణప్రాంత ప్రజలు రైలుకు వచ్చి రైల్వేస్టేషన్ నుంచి తమ గ్రామాలకు వెళ్లాలంటే సమాధుల వద్ద క్రాసింగ్ రహదారిలో ఇలా నిలబడి పడిగాపులు కాయాల్సిందే. ఎండకాలం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.


ఎండలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఘంటసాలకు నివాళి

ధర్మవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాజ్యోతి ప్రాంగణంలో పద్మశ్రీ ఘంటసాల వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాజ్యోతి సంస్థ కార్యదర్శి రామకృష్ణ, అధ్యక్షుడు నారాయణ ప్రారంభించారు. ప్రముఖ గాయకులు బాలకామేశ్వరరావు, హైదరాబాద్ బృంద సభ్యులు ఘంటసాల పాటల కచేరి పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాజ్యోతి ఉపాధ్యక్షులు సింగనమల రామకృష్ణ, సభ్యులు జగ్గా వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, రాంప్రసాద్, మధుసూదన్, పెద్దారెడ్డి, రమేశ్‌బాబు, రామన్న, పోలా వెంకటనారాయణ, మోహన్‌దాస్ పాల్గొన్నారు.


ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు




ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల్లో నిల్వ ఉన్న మురుగునీరు

ప్రధాన రహదారిలో పారుతున్న మురుగునీరు

గాండ్లపెంట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలోనే ఇలా మురుగునీరు పారుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీప ప్రాంతంలో నివాసముంటున్న వారు మురుగునీటిని రోడ్లలోకి వదిలేస్తుండటంతో ఈ సమస్య వస్తోంది. రోడ్లపై గుంతల్లో ఆ మురుగునీరు నిల్వ ఉంటోంది. ప్రతి శనివారం ప్రధాన రహదారిలో స్వచ్ఛభారత్‌పై అధికారులు అవగాహన కల్పిస్తున్నారే తప్పా.. ఈ సమస్యను అసలు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

నిరుపయోగంగా టీటీడీ కల్యాణ మండపం

మందుబాబులకు నిలయమైన వైనం

కొత్తచెరువు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పుట్టపర్తి రహదారి సమీపంలోని తిరుమల తిరుపతి కల్యాణ మండపం దాదాపు నాలుగు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. దీంతో 2000 ఆగస్టున ప్రారంభించారు. దీన్ని రెండేళ్లకు ఒకసారి లీజ్‌కు ఇచ్చేవారు. అయితే లీజ్‌కు తీసుకున్నవారు దాని నిర్వహణ గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో.. ఆ భవనం 20 సంవత్సరాలకే శిథిలావస్థకు చేరుకుంది. నాలుగేళ్ల నుంచి ఎవరూ లీజ్‌కు కూడా తీసుకోవడం లేదు. దీంతో ప్రస్తుతం ఆ భవనం నిరుపయోగంగా మారింది. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ భవనం నేడు మందుబాబులు అడ్డాగా మారింది. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే విచ్చలవిడిగా టీటీడీలో మద్యం సేవిస్తున్నా.. పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఉదయం నుంచి రాత్రి దాకా యువకులు, వృద్ధులు అక్కడే మందు తాగి.. అక్కడే సేద తీరి.. మరీ వెళ్తున్నారు. మరికొందరు గుంపులుగుంపులుగా చేరి మద్యంతోపాటు గంజాయిను సేవిస్తూ అటు వైపు వెళ్లే వారిని బండబూతులు తిడుతున్నారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేయినా.. స్పందన శూన్యం.


టీటీడీ కల్యాణమండపం ఆవరణలో మద్యం తాగుతున్న యువకులు

న్యూస్ బాక్స్

సాంకేతిక పరిజ్ఞానంతోనే దేశాభివృద్ధి

● మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్

హిందూపురం అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వివేకనంద జీవిత చరిత్ర పుస్తకాలు అందించారు. ప్రిన్సిపాల్ హరిప్రసాద్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరిమళ, అధ్యాపకులు శ్రీనివాసులు, హిమబిందు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 32వ వార్డు కౌన్సిలర్ రేష్మ పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను చైర్మన్ రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఆదివారం వార్డులో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా శుభ్రం చేస్తున్నారని అభినందించారు. 30 మంది కార్మికులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందించారు.

మద్యం దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. ఆదివారం ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య సిబ్బంది కలిసి మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలు, బెల్ట్ దుకాణాలు, మద్యం షాపుల పక్కనే సిట్టింగ్ ఏర్పాటుపై పరిశీలించారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. అనంతరం తూమకుంట, పరిగి మండలాల సరిహద్దులో వాహనాలు తనిఖీచేశారు. కర్ణాటక నుంచి తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు.

దాహార్తి తీరుద్దాం



నీటి తొట్టెలను సిద్ధంగా ఉంచిన అనగదత్తా ట్రస్టు సభ్యులు

హిందూపురం అర్బన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశు పక్షాదుల దాహార్తిని తీర్చి మానవత్వాన్ని చాటుదామని న్యాచురల్ ఇంటర్‌నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. ఆదివారం స్థానిక ఆర్.పి.జి.టి రోడ్డులో అనగదత్తా ట్రస్టు ఆధ్వర్యంలో నీటి తొట్టెలను ఉచితంగా అందించారు. ఇళ్ల వద్ద పశువులకు, పక్షులకు నీటిని నింపి దాహార్తి తీర్చాలనే తపన ఉన్న వారు ఎవరైనా వాటిని తీసుకెళ్లి తొట్టెల్లో వేయవచ్చన్నారు.

ప్రతాప్ కుటుంబ సభ్యులకు పరామర్శ



ప్రతాప్ భార్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పెనుకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాపురం ఉంటున్న డిగ్రీ కళాశాల లెక్చరర్ ప్రతాప్ సతీమణి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత వారి గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆదివారం పెనుకొండలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం ప్రతాప్ ఇంటికి వెళ్లి సంగీత ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రామగిరి మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, స్థానిక టీడీపీ నాయకులు టెంకాయల ఫరూక్, జయప్ప, రామన్న, హనుమంతు, నవీన్ ఉన్నారు.

మహిళకు ఆర్థికసాయం

గోరంట్ల, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో నివాసముంటున్న వడ్డె లక్ష్మీదేవికి టీడీపీ నాయకులు రూ. పదివేల ఆర్థికసాయం ఆదివారం అందించారు. టీడీపీకి చెందిన వడ్డె వెంకటరాముప్ప (74) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. స్థానిక టీడీపీ నాయకులు బెల్లాలచెరువు చంద్ర, మనోహర్ లక్ష్మీదేవి నివాసానికి వెళ్లి పరామర్శించారు. భవిష్యత్‌లో ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. జయచంద్రారెడ్డి, సుబహాన్, మూర్తి, డీలర్లు గంగాధర్, ఇర్షాద్, నాయకులు అంజి, నాగరాజు, తిప్పన్న, గంగరాజు, గిరి, కిషోర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సేవామందిరంలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పరికరాలు దెబ్బతినడంతో తాత్కాలికంగా పట్టణానికి సరఫరా ఆగింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతి ఆదేశాల మేరకు ఏఈ లక్ష్మీకాంత్ రెడ్డి సిబ్బందితో అక్కడకు వెళ్లి మరమ్మతులు చేయించి పట్టణానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దాదాపు 25 నిమిషాలు విద్యుత్ సరఫరా ఆగింది.

విద్యార్థులకు అట్టలు, పెన్నుల పంపిణీ

గుడిబండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన షబ్బీర్ అట్టలు, పెన్నులు, స్టడీ మెటీరియల్ అందించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఎస్ఎంసీ చైర్మన్ వీరముద్దప్ప, దాసప్ప, శీనప్ప, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

20న జాబ్‌మేళా

మడకశిరటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఎస్వైటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 20వతేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారికి సత్యసాయి జిల్లా పరిధిలోపాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భానుడి భగ.. భగ.!

● మండుతున్న ఎండలు
● మధ్యాహ్నం అయిందంటే రోడ్లు ఖాళీ
● ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు

హిందూపురం అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే భానుడు విశ్వరూపం చూపుతున్నాడు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు మండుతున్నాయి. సూర్యుడి ప్రతాపానికి పట్టుమని 10 నిమిషాలు కూడా ప్రజలు ఉండలేకపోతున్నారు. ఏ కొంచం నీడ దొరికినా వెళ్లి తలదాచుకుంటున్నారు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందో అని భయపడుతున్నారు. ప్రజలు ఉదయాన్నే అన్ని పనులు కానిచ్చి ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇక సాయంత్రం చల్లబడేంత వరకు బయటికి రాలేని పరిస్థితి. మధ్యాహ్నం అయిందంటే చాలు రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు జన సంచారం లేకుండా నిర్మానుష్యంగా మారాయి. వృద్ధులు, చిన్న పిల్లల విషయానికొస్తే జాగ్రత్తలు పాటించకపోతే వడదెబ్బకు గురికావాల్సి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వేడి నుంచి ఊరట కోసం శీతల పానీయాలు సేవించేందుకు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. కుండల్లో నీళ్లు తాగితే కాస్త ఉపశమనం కలుగుతుంది. పట్టణంలో చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు.

కొబ్బరి బోండం రూ.50

ఎండలు మండుతుంటే కొబ్బరి బోండానికి గిరాకీ పెరిగింది. ఉన్నఫలంగా ఒక్కో కొబ్బరి బోండం రూ.50 పెంచేశారు. వేసవిలో చలువను ఇచ్చే వస్తువుల్లో కొబ్బరికాయ ఒకటి. దీంతో వ్యాపారులు దీన్ని అసరాగా చేసుకుని దండుకుంటున్నారు.



ఎన్టీఆర్ మార్గ్‌లో జనసంచారం లేక ఇలా..

జాగ్రత్తలు పాటించాలి: నరేంద్ర జక్కా, ఫిజీషియన్

వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఎండ సమయంలో అవసరం అయితే తప్పా తిరగరాదు. వదులుగా ఉన్న దుస్తులు ధరించాలి. నీటిని ఎక్కువగా తీసుకోవాలి. ఎండకు వెళ్లేవారు గొడుగు తీసుకెళ్లాలి. వృద్ధులు, చిన్న పిల్లలు మరీ జాగ్రత్తగా ఉండాలి. వాంతులు విరేచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రతి రోజూ 4 నుంచి 5 లీటర్ల నీరు తాగాలి.

మత సామరస్యానికి ప్రతీక పెనుకొండ: మంత్రి

● ఘనంగా పశ్వాపార్శ్వనాథ ఆలయ వార్షికోత్సవం

పెనుకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక పెనుకొండ అని హిందూ, ముస్లిం, జైన మతస్థులకు నిలయంగా వెలుగొందుతోందని మంత్రి సవిత అన్నారు. ఆదివారం స్థానిక పశ్వాపార్శ్వనాథ స్వామి జైన ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు జీనచంద్రయ్య, బ్రహ్మనంద, అజితప్రసాద్, ఆదిదినేష్ ఆధ్వర్యంలో స్వామివారికి 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథులుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రకీర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెనుకొండ మతసామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలకు దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిచెందిన బాబయ్యదర్గా హిందువులకు సంబంధించిన 365దేవాలయాలతోపాటు భారతదేశంలోనే నాలుగు జైన పీఠాల్లో ఒకటి పెనుకొండలో ఉండటం గర్వకారణమన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చంద్రకీర్తి, రాజన్, పద్మప్రభ, సురేష్‌కుమార్, సుందరరామయ్య, పార్శ్వనాథ్ వేదలవేణి హాజరయ్యారు.



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

రూ.కోట్ల ప్రజాధనం బుగ్గిపాలు: గుండుమల

మడకశిరటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అప్పటి సీఎం చంద్రబాబు రూ.66కోట్లు మంజూరు చేశారని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కమీషన్ల కోసం కక్కుర్తిపడి బుగ్గిపాలు చేశారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. అగ్ని ప్రమాదం జరిగిన మార్కెట్‌యార్డును ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకుల పనులు కొంత వరకు చేశారని, అధికారంలోకి వచ్చిన వైసీపీ అవసరం లేకున్నా పనులు చేసే సమయంలో పైపులు కొనుగోలు చేయాల్సి ఉన్నా పట్టించుకోకుండా కమీషన్ల కోసం కక్కుర్తిపడి పైపులు కొనుగోలు చేసి మార్కెట్‌యార్డులో నాలుగు సంవత్సరాల క్రితం నిల్వ చేశారని అన్నారు. శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.2.04కోట్ల విలువచేసే పైపులు బుగ్గిపాలు కావడానికి గత ప్రభుత్వ పాలకులే కారణం అని ఆరోపించారు. మార్కెట్‌యార్డు అధికారులు పుట్టపర్తి ఏడీఎం నరసింహమూర్తి, డీఈఈ ఎస్.రఘునాథ్ పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

ఆలయ నిర్మాణానికి భూమిపూజ: పట్టణంలోని అంజనేయస్వామి ఆలయ ఆవరణలో రాఘవేంద్రస్వామి నూతన ఆలయాన్ని నిర్మించనున్న నేపథ్యంలో ఆదివారం టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి భూమిపూజ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శి రంగేగౌడ్, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.

సేవను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ సరోజినీదేవి

మడకశిర రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సమాజ సేవ అలవర్చుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీ దేవి అన్నారు. కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులగా ఆర్. అనంతపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపును నిర్వహించారు. ఆదివారం ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వారం రోజుల పాటు విద్యార్థులు ప్రజలతో మమేకమై వారి కష్టానుఖాలను తెలుసుకున్నారన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థులు బాగా చదివి మంచి శాస్త్రవేత్తలు కావలని పిలుపునిచ్చారు. సర్పంచు అంజనమ్మ, ప్రోగాం ఆఫీసర్ మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెంకరకు తీరిన తాగునీటి కష్టాలు



కెంకర గ్రామంలో బోరు వేస్తున్న దృశ్యం

అమరాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కెంకెర గ్రామంలో నీటి కొరత ఉందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలకు తెలపగా తక్షణమే స్పందించి బోరును తవ్వించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు శనివారం రాత్రి 620 అడుగుల బోరు తవ్వించగా నీరు సమృద్ధిగా లభించిందని గ్రామస్థులు తెలిపారు. నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్, గొల్లమారనపల్లి రామచంద్రప్ప, పంచాయతీ కన్వీనర్ తిప్పజ్జ, డీఈ మనూనాయక్, నింగేగౌడ్, తిప్పేస్వామి, శివన్న, గోపాల్, గిరీష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయులను నియమించండి

హిందూపురం అర్బన్ మార్చి 16(ఆంధ్రజ్యోతి): జీవనోపాధికోసం వలస వచ్చిన కార్మికుల పిల్లలకు హిందీలో విద్యాబోధన చేయగలిగే ఉపాధ్యాయులను నియమించాలని తూమకుంట హెచ్ఎం బాలగంగాధర్, చౌళూరు ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం పెనుకొండలో బీసీ, సంక్షేమం, జౌళిశాల మంత్రి సవితను కలిసి వారు వినతి అందించారు. తూమకుంట పారిశ్రామిక వాడ ప్రాంతంలో బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వందలాది కుటుంబాలు జీవనోపాధి కోసం వలసలు వచ్చారు. అయితే వారి పిల్లలు పాఠశాలలకు వెళ్లినా తెలుగు అర్థం కాకపోవడంతో వారిలో కొంత మంది బాల కార్మికులుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 61 మంది హిందీ చదువుకునే పిల్లలు ఉన్నారన్నారు. మంతి మాట్లాడుతూ ఈ విషయం విద్యాశాఖ మంత్రితో, అర్జేడీలను సంప్రదించి వచ్చే విద్యా సంవత్సరంలో హిందీ ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు.

మైలార లింగేశ్వరుడికి దోణి సేవ

అమరాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలస గ్రామంలో మడివాళ కులస్థుల ఆరాధ్యదైవం మైలార లింగేశ్వర స్వామి దోణి సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలధి పూజ, భక్తులు వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులచే మహా మంగళ హారతి, తీర్థప్రసాదాన్ని అందించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం ముందు భక్తులు తెచ్చిన అరటిపండ్లు, పాలు చక్కెర తదితర వాటిని పళ్లెంలో ఉంచి దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎట్టకేలకు పార్కు శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పార్కులో చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

హిందూపురం అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు హౌసింగ్ బోర్డు పార్కును శుభ్రం చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన ఆహ్లాదం అందించని పార్కులు అన్న శీర్షికకు మున్సిపల్ కౌన్సిలర్ స్పందించారు. పారిశుధ్య సిబ్బందిని పిలిపించి పార్కులో చెత్తాచెదారం తీసివేయించి పరిశుభ్రం చేయించారు. ఎప్పటికప్పుడు పార్కును శుభ్రంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

వర్గీకరణ అమలు చేయకపోతే సీఎం గద్దెదిగాలి

పావగడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయకపోతే సిద్దరామయ్య గద్దె దిగాలని కర్ణాటక శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు చలవాది నారాయణస్వామి హెచ్చరించారు. వర్గీకరణ అమలు చేయాలని డీఎస్ఎస్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ పి. కృష్ణప్ప సమాధి నుంచి పాదయాత్ర చేపట్టి 12రోజులు పూర్తయ్యిందన్నారు. తుమకూరుకు చేరుకున్న సందర్భంగా టౌన్‌హాల్ సర్కిల్‌లో మానవహారం ఏర్పడి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సూలగిత్తి నరసమ్మ పార్కులో నిర్వహించిన దళిత ఐక్య విప్లవాత్మక పాదయాత్ర బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాదయాత్రలో పావగడ నుంచి దళిత నాయకులు లాయర్లు, స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు, తుమకూరు డీఎస్ఎస్ నాయకులు మధుగిరి మాజీ ఎమ్మెల్యే గంగ హనుమయ్య, కేబల్ రఘు, బాస్కర్, ప్రసాద్ పాల్గొని పాదయాత్రను దాబాస్పేట్ వైపు కొనసాగించారు. హరిహర నుంచి వర్గీకరణ కోసం పాదయాత్ర చేపట్టిన సురేష్ అనే వ్యక్తి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరాడు.

తుమకూరుకు దళితుల పాదయాత్ర: ఏబీసీడీ వర్గీకరణ కోసం ప్రొఫెసర్ బి. కృష్ణప్ప సమాధినుంచి హరిహర తాలూకా దళిత నాయకులు చేపట్టిన పాదయాత్ర ఆదివారం తుమకూరు చేరింది. ఎస్సీ వర్గీకరణ 30ఏళ్ల నుంచి పోరాటాలు చేస్తునాన ఏ రాజకీయ పార్టీ కూడా వర్గీకరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టలేదని జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు వైహెచ్ హుచ్చయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్ర 21వ తేదీన బెంగళూరు చేరుతుందని, అనంతరం రాజభవన్‌ను ముట్టడిస్తామన్నారు. పావగడనుంచి 100మందికిపైగా దళిత నాయకులు పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు చలవాది నారాయణస్వామి

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



అమరజీవి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడని మంత్రి సవిత కొనియాడారు. ఆదివారం పార్టీకార్యాలయంలో ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య నాయకులు కేశవయ్య, పోతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మాధవనాయుడు, చిన్నవెంకటరాముడు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, రామలింగ, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు మంత్రి ఇఫ్తార్ విందు



ఉపవాస దీక్ష ఉన్న వారికి భోజనం వడ్డిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముస్లింలకు మంత్రి సవిత ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింల కోసం ఏర్పాటుచేసే ఇఫ్తార్ విందు ఆత్మీయతకు ప్రతీక అని మంత్రి అన్నారు. సవిత పెట్రోల్ బంక్‌వద్ద ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

వైసీపీని వీడి.. టీడీపీలోకి చేరిక: మంత్రి సవిత సమక్షంలో 40మంది వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. పరిగి మండలానికి చెందిన వైసీపీ నాయకులకు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొత్తపల్లి, ఎన్. ముద్దిరెడ్డిపల్లి, దేవరపల్లి గ్రామాల నుంచి ఉన్నారు.

రంజాన్ వేళలు

హిందూపురం	ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.12
పెనుకొండ	ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.12
	(సోమవారం సాయంత్రం)	(మంగళవారం ఉదయం)

మహిళా సంఘాల పనితీరు భేష్



మహిళా సంఘాల సభ్యులతో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కోఆర్డినేటర్ నాగరాజు

గుడిబండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర గ్రామం పవిత్ర గ్రామైక్య సంఘం పనితీరు భేష్ అని మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, కో-ఆర్డినేటర్ ఎస్.ఆర్.నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం కరికెర గ్రామంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు.. అనంతరం కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా నుంచి వచ్చిన 80 మంది మహిళా సంఘం సభ్యులు కరికెర గ్రామంలో మహిళా సంఘం సభ్యులు, రైతు సంఘాల నిర్వహణ తదితర వాటి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఫోర్డ్ సంస్థ అధ్యక్షుడు బదిరీష్, మహలింగప్ప, వెంకటేష్, ఏపీఎం తిప్పన్న, సీసీలు రామాంజనేయులు, దేవరాజు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

రొళ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకి టీడీపీ నాయకుడు మాజీ సర్పంచి తిమ్మేగౌడ్‌కు చెందిన మల్బరీ గడ్డివామి, షెడ్డు కాలిపోవడంతో రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుతోమాట్లాడి ఆర్థిక సహాయం అందించనున్నట్లు మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, టీఎన్‌టీయూసీ మూర్తి తెలిపారు.

యూటీఎఫ్ పోరుబాట



యూటీఎఫ్ పోరుబాట బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెనుకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణ ఆర్థిక బకాయిల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడికోసం, బకాయిల కోసం పోరుబాట సదస్సును నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శి జయచంద్రారెడ్డి, సుధాకర్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో చేపడుతున్న పోరుబాట సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం పట్టణంలోని మౌలా రెసిడెన్సీలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ పాలకుల వైఖరి కారణంగా గడిచిన ఐదేళ్లకాలంలో విద్యారంగ సమస్యలతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాల సమస్యలు కూడా అపరిష్కృతంగా నిలిచిపోయాయన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బూతప్ప, బాబు, శ్రీనివాసులు, శివశంకర్, లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్, అనిల్‌కుమార్, నరసింహప్ప, మారుతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ధర్మవరంరూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని కరెంట్ ఆఫీసు మార్కెట్‌వీధి వాసి బోయ నారాయణస్వామి (54) అక్కడికక్కడే మరణించాడు. ఇతను ఓ ప్రైవేటు పాఠశాల టీచర్. ఆదివారం రాత్రి ధర్మవరం నుంచి అనంతపురానికి తన ద్విచక్రవాహనంలో సాంబశివుడు అనే వ్యక్తితో కలిసి బయలుదేరాడు. చిగిచెర్ల గ్రామ సమీపం.. మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా.. వేగంగా వెళ్లాడు. దీంతో బైక్ అదుపు తప్పి.. కల్వర్టు గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నారాయణస్వామి అక్కడికక్కడే మరణించాడు. సాంబశివుడు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేసుకొని.. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. నారాయణస్వామికి భార్య అరుణ, ఒక కుమారుడు దుర్గాసీరాజ్ ఉన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

గాండ్లపెంట, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల పంచాయతీ సీ.ఎం. తండాలో నాటుసారా నిర్మూలనపై ఆదివారం ఎక్సైజ్ అధికారులు ఆధ్వర్యంలో కళాజాత బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమద్దయ్య, ఎస్ఐలు శ్రీధర్, దత్తాత్రేయ, జిల్లా టాస్క్ పోలీస్ ఎస్ఐ హరిక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.